సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 26 । ఏప్రిల్ । 2025



యథేచ్ఛగా చెట్ల నరికివేత

ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం-గుణ్ణంపల్లి మధ్యలోని పోలవరం కుడి కాలువ గట్టుపై పది రోజులుగా చెట్లు నరికేస్తున్నా.. పట్టించుకునే వారే లేరు. 10లో ▸



పాలిటెక్నిక్, ఐటీఐతో ఉద్యోగాలు

పాలిటెక్నిక్, ఐటీఐ చేస్తే ఉద్యోగాలు మెండుగా ఉన్నాయని, 'పది' పాసైన వారు పాలిటెక్నిక్‌లో చేరాలనుకోవడం మంచి నిర్ణయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. 10లో ▸



మట్టిని తోడేస్తున్న మాఫియా

నూజివీడు మండలం ఓగిరాల తండాకు చెందిన టీడీపీ నాయకుడు పాలెం చెరువులో మూడు రోజులుగా అక్రమ తవ్వకాలు చేపట్టి మట్టిని తవ్వేస్తున్నాడు. 10లో ▸

గట్లకు తూట్లు

డ్రెయిన్ గట్లకు తూట్లు పొడుస్తూ జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. గోదావరి గట్టును పటిష్టం చేసే పేరిట కొందరు, అనధికారికంగా మరికొందరు మేజర్ డ్రెయిన్ల గట్లను కొల్లగొట్టి మట్టిని తరలించుకుపోతున్నారు. పలుచోట్ల గట్లు కృంగిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

- నక్కల డ్రెయిన్‌లో పరిమితికి మించి తవ్వకాలు
- రూ.కోటికి పైగా విలువైన మట్టిని తరలించేసిన కూటమి నేతలు
- ఆచంట వేమవరం వద్ద జారిపోయిన గట్టు
- దువ్వలో వయ్యేరు డ్రెయిన్ గట్టు గుల్ల
- చోద్యం చూస్తున్న అధికారులు

సాక్షి, భీమవరం: యలమంచిలి మండలం కంచుస్తంభంపాలెం పంచాయతీ వాకలగరువు, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, లక్ష్మీపాలెం గ్రామాల పరిధిలో దాదాపు రెండున్నర కిలోమీటర్ల మేర సుమారు రూ.6.71 కోట్ల వ్యయంతో వశిష్ట గోదావరి ఏటిగట్టు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నాలుగు నుంచి ఐదు మీటర్లు మేర గట్టును ఎత్తు చేస్తున్నారు. ఆచంట మండలంలోని ఆచంట వేమవరంలోని నక్కల డ్రెయిన్ గట్టుపై కన్నేసిన కూటమి నేతలు ఇక్కడి నుంచి ఏటిగట్టు పనులకు మట్టి తరలించే పేరిట తవ్వకాలు చేపట్టారు. డ్రెయిన్ గట్టును ఆనుకుని డ్రైనేజీ శాఖకు చెందిన సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో నాలుగు అడుగుల నుంచి ఎనిమిది అడుగుల లోతు వరకు తవ్వకాలు చేసేశారు. ఏటిగట్టు పనుల ముసుగులో మట్టిని పక్కదారి పట్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. పాలకొల్లు, పరిసరాల్లో కొత్తగా వెలుస్తున్న లే అవుట్లు, మెరక పనుల కోసం మట్టిని తరలించేసినట్టు తెలుస్తోంది. నెలరోజుల్లో దాదాపు రూ.కోటికి పైగా విలువైన మట్టిని తరలించుకుపోయినట్టు అంచనా. పరిమితులు పాటించకుండా ఇష్టానుసారంగా తవ్వకాలు చేయడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు తెలిపారు. రోజుకు వందకు పైగా లారీల్లో, నెలరోజులకు పైగా తవ్వకాలు చేసినట్టు తెలిపారు. భారీ లోడుతో లారీలు తిరగడం వలన ఎక్కడికక్కడ గట్టు కృంగి పోయింది. తవ్వకాలు చేసిన చోట ట్రాక్టర్ వెళ్లే దారి లేకుండా గట్టు కాలువలోకి జారిపోయి ప్రమాదభరితంగా తయారైంది. ఇప్పటికే ఆచంట వేమవరం పరిధిలోని ఒక చోట డ్రెయిన్ గట్టు బలహీన పడటంతో ఇక్కడి నుంచి మట్టి తీసుకువెళ్లి గట్టు పటిష్టం చేయాలని భావించామని, ఇంతలో మొత్తం మట్టిని మొత్తం ఊడ్చుకుని ఎత్తుకెళ్లిపోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆచంట వేమవరం వద్ద కిందికి జారిపోయిన నక్కల డ్రెయిన్ గట్టు

వయ్యేరులో అక్రమ తవ్వకాలు

తణుకు నియోజకవర్గంలో ప్రధానమైన వయ్యేరు అక్రమ తవ్వకాలతో గట్లు బలహీన పడుతున్నాయి. గత ఏడాది భారీ వర్షాలతో ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం ప్రాంతంలో గండిపడి రెండు వేల ఎకరాల్లోని వరి పంట నీటమునిగింది. వయ్యేరు ప్రవాహ ఉధృతికి తణుకు మండలంలోని దువ్వ, తేతలి తదితర గ్రామాల్లో వరి పంట మునిగిపోయింది. దువ్వ రెగ్యులేటరీ వద్ద నివాసాలు నీట మునిగాయి. డ్రెయిన్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రెయినేజీ శాఖకు చెందిన అధికారిపై అప్పట్లో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు సైతం తీసుకున్నారు. అయినా సంబంధిత అధికారులు పాఠాలు నేర్వకపోవడం గమనార్హం. దువ్వ సమీపంలో వయ్యేరు డ్రెయిన్‌లో రాత్రి వేళల్లో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. పొక్లెయిన్లతో గట్టును తొలిచి ట్రాక్టర్లలో మట్టిని తరలించుకుపోతున్నారు. ట్రాక్టర్లు డ్రెయిన్‌లోకి దిగేందుకు వీలుగా ఇసుక ర్యాంపుల్లో మాదిరి బాటను కూడా ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ట్రాక్టర్ మట్టి రూ.1,000 నుంచి రూ.1,500 వరకు అమ్మకాలు చేస్తున్నారు. అక్రమ తవ్వకాలతో గట్లు బలహీన పడుతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాలు, వరదల సమయంలో గండి పడి ముంపునకు గురయ్యే ప్రమాదముందని వారంటున్నారు. అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని, గట్లను పటిష్టం చేయాలని కోరుతున్నారు. ఆచంట వేమవరంలో నక్కల డ్రెయిన్ గట్టు తవ్వకాలు గూర్చి ఆచంట తహసీల్దార్ కనకరాజును సంప్రదించగా తమ పరిధిలోకి రాదని తెలిపారు. నక్కల డ్రెయిన్, వయ్యేరు డ్రెయిన్‌లో తవ్వకాలుపై డ్రెయినేజీ ఈఈ సత్యనారాయణను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా కలవలేదు.



వయ్యేరులో మట్టి తవ్వకాల కోసం ఏర్పాటుచేసిన బాట



నక్కల డ్రెయిన్ గట్టు మట్టిని తరలించుకుపోయిన దృశ్యం

న్యూస్‌రీల్

సాక్షి కార్యాలయంపై దాడికి నిరసన



పాలకొల్లు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్ట్ సంఘ నాయకులు

యలమంచిలి: ఏలూరు సాక్షి కార్యాలయంపై ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, అతని అనుచరుల దాడిని ఖండిస్తూ పాలకొల్లు ప్రెస్‌క్లబ్ నాయకులు శుక్రవారం పాలకొల్లు తహసీల్దార్ వై.దుర్గా కిషోర్‌కు వినతిపత్రం ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్న వారిని అరెస్ట్ చేయాలని కోరారు. ఇలంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. నిరసన తెలిపిన వారిలో పాలకొల్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ, కార్యదర్శి ఎం.వి.సాంబశివరావు, ఏపీడబ్ల్యూజే జిల్లా కోశాధికారి ముత్యాల శ్రీనివాస్, ఏపీడబ్ల్యూఈ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు జక్కంశెట్టి శ్రీనివాసరావు, పీటీ వెంకటేశ్వరరావు, మద్దా విజయ లాజరస్, మండెల అప్పలరాజు, కర్రా నాయుడు, బుడ్డిగ గోపి, బండి శ్రీనుబాబు, కాపిశెట్టి గోపాలరావు, కారుమంచి రాజగోపాల్, టి.రాఘవ, గుడాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో ప్రథమ స్థానం



గూడెం కమిషనర్ యేసుబాబుకు సత్కారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాజమండ్రి రీజియన్‌లో ఆరు పురపాలక సంఘాల పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు వసూలులో రాష్ట్రంలోనే రీజియన్ ప్రథమ స్థానం సాధించింది. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో రీజినల్ డైరక్టర్(రాజమండ్రి) సీహెచ్ నాగ నరసింహరావుకు సత్కారం చేశారు. పాత పశ్చిమ గోదావరి జిల్లా పురపాలక సంఘాల కమిషనర్లు హాజరయ్యారు. పన్ను వసూలులో తాడేపల్లిగూడెం మూడో స్థానం సాధించడంతో కమిషనర్ యేసుబాబును సత్కరించారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

ఏలూరు (టూటౌన్): మే 10న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూలై 5కి వాయిదా వేసినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. కక్షిదారులు ఈ మార్పును గమనించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

భీమవరం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర కమిటీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఇంటలెక్చువల్స్ ఫోరం అధికార ప్రతినిధిగా ఈదా యహోషువా, రాష్ట్ర స్టూడెంట్ వింగ్ జాయింట్ సెక్రటరీగా ఇనపర్తి రాహుల్, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా గూడూరి ఉమాబాల, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ జనరల్ సెక్రటరీలుగా వీరమల్లు లక్ష్మి నారాయణ, ఇంజేటి జాన్ కెన్నడీ, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా కరిమెరక రామచంద్రరావు నియమితులయ్యారు.

పన్ను వసూళ్లు, చెత్త సేకరణలో అవార్డులు



అవార్డు అందుకున్న డీపీఓ అరుణశ్రీని అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర స్థాయిలో పన్ను వసూళ్లు, ఇంటింటా చెత్త సేకరణలో పశ్చిమగోదావరి జిల్లా రెండు అవార్డులను సొంతం చేసుకోవడంతో పంచాయతీరాజ్ శాఖ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. శుక్రవారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్‌ను డీపీఓ బి.అరుణ శ్రీ కలుసుకుని అవార్డుల విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని, ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు.

చెరువుల లీజు పేరుతో బ్యాంకుకు టోపీ



వివరాలు సేకరిస్తున్న సీబీఐ అధికారులు

ముదినేపల్లి రూరల్: చేపల చెరువులు లీజుకు తీసుకున్నట్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకు నుంచి రూ.కోట్లలో రుణం పొంది ఎగ్గొట్టిన వైనంపై సీబీఐ అధికారులు మండలంలోని పలు గ్రామాల్లో గురు, శుక్రవారాల్లో విచారణ నిర్వహించారు. గురజ, చేవూరు, దేవరం, కాకరవాడ, అల్లూరు గ్రామాల పరిధిలోని రైతుల పేరుతో పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ఒక బడాబాబు భీమవరంలోని ఒక జాతీయ బ్యాంకులో 10 ఏళ్ళ క్రితం రూ.కోట్లలో రుణం పొందాడు. 188 మంది రైతుల పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్లు తయారుచేసి చేపల చెరువులు లీజుకు తీసుకున్నట్లు అగ్రిమెంట్లు సృష్టించి బ్యాంకులో రుణం పొందాడు. ఈ రుణాన్ని చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి పరిశీలించగా.. బోగస్ డాక్యుమెంట్లతో రుణాన్ని పొందినట్లు గుర్తించారు. దీనిపై సీబీఐ అధికారులకు గత అక్టోబరులో ఫిర్యాదు చేశారు. సీబీఐ అధికారులు గురు, శుక్రవారాల్లో మండలంలో విచారణ జరిపారు. తమ పేరున ఉన్న వరిసాగు చేసుకున్న పొలాలను 2020లో చెరువులు తవ్వించగా 2015 లోనే చెరువులు లీజుకు తీసుకున్నట్లు అగ్రిమెంట్లు ఎలా సృష్టించారని ప్రశ్నించారు. స్థానిక వీఆర్వోల నుంచి వివరాలు సేకరించారు. తమ పేరున రూ.కోట్లలో రుణాలు పొందడం సాధారణంగా సాధ్యమయ్యే పని కాదని ఇందుకు స్థానికులు కొందరు సహకరించి ఉంటారనే అనుమానాన్ని బాధిత రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఈ దొంగ రుణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని సీబీఐ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో చేరికలు ప్రోత్సహించాలి

భీమవరం: ప్రభుత్వ పాఠశాలలో చేరికలపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు విద్యాబోధనపై ఇంటింటి ప్రచారం ద్వారా తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టెన్త్ పరీక్ష ఫలితాలు, ప్రభుత్వ పాఠశాలలో చేరికలు, అల్పాదాయ వర్గాల పిల్లలకు 25 శాతం సీట్ల కేటాయింపు, బడి బయట పిల్లలు చేరికలు, ఆపార్ ఐడీ నమోదు అంశాలపై అధికారులతో సమీక్షించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరగాలన్నారు. టెన్త్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు అడుగు సమాచారంతో రూపొందించిన కరపత్రం, వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.



భీమవరం కలెక్టరేట్‌లో బడి వైపు ఒక అడుగు కరపత్రం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

అధికారులు మరింత కృషి చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు మరింత కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వర్క్ ఫ్రం హోం, ఈ కేవైసీ, ఆధార్ నమోదు, మిస్సింగ్ సిటిజన్స్, మనమిత్ర అంశాలపై గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. లక్ష్య సాధనకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆధార్ నమోదు కాని పిల్లలకు సత్వరమే ఆధార్ నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు, వారి హక్కులపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ అన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 అనుబంధం మార్గదర్శకాలు అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టం అమలుపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 15 రోజుల్లో జిల్లా అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించాలని సూచించారు.

రఘురామకృష్ణరాజు నోరు అదుపులో పెట్టుకోవాలి

సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు బలరాం

భీమవరం: ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు సీపీఎం రాష్ట్ర కార్యదర్శిపై చేసిన వ్యాఖ్యలు అవమానకరం, అసభ్యకరంగా ఉన్నాయని, ఆయన నోటిని అదుపులో పెట్టుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం అన్నారు. శుక్రవారం భీమవరం సుందరయ్య భవనంలో విలేకరుల సమావేశంలో పార్టీ కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్, కార్యదర్శి వర్గ సభ్యుడు బి.వాసుదేవరావుతో కలిసి మాట్లాడారు. నిత్యం అసభ్య పదజాలాన్ని ఉపయోగించే వ్యక్తి కాబట్టే డిప్యూటీ స్పీకర్ పదవికి అనర్హుడని మా పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారన్నారు. ఆయన దూషణలు, తాటాకు చప్పుళ్లకు కమ్యూనిస్టులు బెదిరిపోరని స్పష్టం చేశారు. నాలుక ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. మా పార్టీ నాయకుడు మీలా పార్టీలు మారి పదవి కోసం గడపల దగ్గర దేకలేదని, ఆర్థిక నేరగాడు కాదని, ప్రజా ధనాన్ని లూటీ చేసిన మనిషి కాదని విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల్లో ప్రజలు గెలిపిస్తే ఏం చేయకుండా అధికారాన్ని, ప్రజా ధనాన్ని అలవెన్సులుగా తీసుకుని ఢిల్లీలో ఎందుకు కూర్చున్నారన్నారని ప్రశ్నించారు. రఘురామకృష్ణరాజు భూస్వాములకు అమ్ముడైపోయాడని, అందుకే వారి చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములు ఆయనకు కనబడడం లేదన్నారు. కాలుష్యమంటూ గొంతు చించుకుంటున్న ఆయనకు యనమదుర్రు డ్రెయిన్, వెంకయ్య వయ్యేరు, బొండాడ డ్రెయిన్, గొంతేరు నదిలో ఉన్న కాలుష్యం కనబడదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు తన నియోజకవర్గంలో శిథిలావస్థల్లో ఉన్న గరగపర్రు, జక్కరం వంతెనలు కనబడవా? అని ఎద్దేవా చేశారు. ఉండి నియోజకవర్గంలో వేలాది ఎకరాల అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు బడాబాబుల చేతుల్లో ఉన్నాయని దమ్ముంటే స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సవాల్ విసిరారు. జిల్లాలోని పోలీసులు, ఇతర శాఖల అధికారులు తప్పు చేస్తున్నారని ఎవరో చెబితే నిబంధనలకు వ్యతిరేకంగా చేస్తే ఆ తర్వాత పర్యవసానం వల్ల ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో 800 పేదల ఇళ్లు, 200 షాపులు కూల్చి వేయించి సుమారు రూ.40 కోట్ల ఆస్తిని ధ్వంసం చేయించారని గోపాలన్ చెప్పారు.



భీమవరంలో మాట్లాడుతున్న బలరాం

నేడు పాలకోడేరుకు లాయర్ల బృందం

పాలకోడేరు: పాలకోడేరు ఏఎస్ఆర్ నగర్‌లో శనివారం హైకోర్టు లాయర్ల బృందం పర్యటించనున్నట్లు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్, జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి తెలిపారు. ఇటీవల ఉండి నియోజకవర్గం పాలకోడేరు మండలంలో పేదల ఇళ్లను అక్రమంగా కూల్చివేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలన సృష్టించిందన్నారు. పౌర హక్కులకు భంగం వాటిల్లేలా, హైకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి అధికారులు నిరంకుశత్వంగా వ్యవహరించారన్నారు. పేదల ఇళ్లను కూల్చివేయడానికి కారణాల నిజనిర్ధారణకు విజయవాడ నుంచి ప్రముఖ లాయర్లతో బృందం వస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఏఎస్ఆర్ నగర్‌కు చేరుకుని బాధితుల సమస్యలను తెలుసుకుంటారన్నారు. ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దిగుపాటి రాజగోపాల్, రాష్ట్ర నాయకులు బాధితులతో మాట్లాడనున్నారు.

ఉగ్ర రక్కసిపై నిరసన గళం



భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తణుకు నరేంద్ర సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన

భీమవరం: కాశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ భీమవరంలో శుక్రవారం ఇండియన్ ఫోరం ఫర్ పీస్ అండ్ డెమోక్రసీ ఆధ్వర్యంలో మతాలకతీతంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్రకాశంచౌక్ సెంటర్‌లో ర్యాలీనుద్దేశించి ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ముహమ్మద్ సిద్దిక్ మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి మానవతపై జరిగిన దాడిగా అభివర్ణించారు. సీపీఎం సెక్రెటరియేట్ సభ్యుడు బి.బలరామ్, దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు గంటా సుందరకుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, జమాతే ఇస్లామీ హింద్, స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్, క్రైస్తవ, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తణుకులో..

తణుకు అర్బన్: ఉగ్రవాదుల మారణకాండకు నిరసనగా తణుకులో ముస్లిం మహిళలు శుక్రవారం నిరసన తెలిపారు. ఉగ్రవాదం నశించాలి.. హంతకులను శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ముస్లిం మహిళలతోపాటు ఐద్వా మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో దోపిడీ?

- ఒక్కో విద్యార్థిని నుంచి రూ.16 వేల వరకూ వసూలు
- పేద విద్యార్థినులపై ఆర్థిక భారం

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి భవనంలో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) కోర్సుకు కౌన్సెలింగ్ ద్వారా సీట్లు భర్తీ చేస్తారు. పూర్తి ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారు. జీఎన్ఎం కాలేజీ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పేద పిల్లల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నాయి. జీజీహెచ్ భవనంలోని నర్సింగ్ కాలేజీలో అధికారులు భారీగా అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ జీఎన్ఎం కోర్సుకు అడ్మిషన్లు జరిగాయి. ప్రభుత్వం ఏటా 60 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల బాలికలకు జీఎన్ఎం కోర్సు చదివేందుకు అడ్మిషన్లు ఇస్తోంది. అడ్మిషన్ల సమయంలో సదరు నర్సింగ్ కాలేజీ యాజమాన్యం కొత్తగా కోర్సులో చేరుతున్న పిల్లల తల్లిదండ్రుల నుంచి వివిధ రకాల ఫీజుల పేరుతో సుమారుగా రూ.16 వేల వరకూ వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అడ్మిషన్ చార్జీ పేరుతో రూ.2 వేలు, పుస్తకాల పేరుతో కొంత వసూలు చేస్తున్నారు. యూనిఫాంలు బయట కుట్టించుకోవటానికి వీల్లేదని.. నర్సింగ్ కాలేజీ చెప్పిన చోట డబ్బులు కట్టి యూనిఫాం తీసుకోవాలని నిబంధన పెడుతున్నారు. ముందుగా భోజనం పెట్టటం సాధ్యం కాదని.. స్టైఫండ్ వచ్చే సరికి 3 నెలలు పడుతుందని ఈ లోగా ఆ సొమ్ములు మీరే చెల్లించాలని చెబుతున్నారు.



ఏలూరు సర్వజన ఆసుపత్రి భవనం (ఫైల్)

ప్రశ్నిస్తే.. వేధింపులే ?

అసలే పేదవర్గాల పిల్లలు.. ఏదైనా సమస్య వస్తే ఇదేంటని ప్రశ్నిస్తే... వారికి ఇక వేధింపులే. పాస్ కావాలంటే మా చేతుల్లోనే ఉంటుందని, నోరెత్తితే సర్టిఫికెట్ రాదంటూ బెదిరిస్తున్నారు. విద్యార్థినిలు తమ బాధను మౌనంగానే భరిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. బాత్‌రూంలు సరిపడా ఉండవు. వాటిని క్లీన్ చేయటానికి సిబ్బందిని డబ్బులు ఇచ్చి మరీ ఏర్పాటు చేస్తారు. అయితే విద్యార్థినులే బాత్‌రూం క్లీన్ చేసుకోవాలంటున్నారు.

శిక్షణకు రవాణా చార్జీలు చెల్లించాల్సిందే

కోర్సులో భాగంగా సర్వేలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. రూరల్ ప్రాంతాలకు తీసుకెళ్ళేందుకు రవాణా చార్జీలు వారే చెల్లించాల్సి రావటం భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల పాటు సర్వే, ఇతర శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని, రోజుకు సుమారుగా రూ.70 నుంచి రూ.100 ఖర్చు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు .నెలకు సుమారుగా రూ.2 వేలకు పైగా వెచ్చించాల్సి రావటం వారి కుటుంబాలపై ఆర్థికంగా భారం పడుతుందని వాపోతున్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

భీమవరం: భీమవరం పట్టణంలో చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటిక పోటీల్లో రెండో రోజు శుక్రవారం ప్రదర్శించిన నాటికలు ఆలోచింప చేశాయి. హైదరాబాద్ యువభేరి ఆర్గనైజేషన్ వారి 'నా శత్రువు' నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసేలా సాగింది. అక్కల తామేశ్వరయ్య రచన, వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించారు. రెండో ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం' నాటిక కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బు సంపాదనే ధ్యేయంగా విలువలు కోల్పోయిన తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచన, యేపూరి హరిబాబు దర్శకత్వంలో ఈ నాటిక ప్రదర్శించారు. మూడవ ప్రదర్శనగా చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ 'మా ఇంటో మహాభారతం' నాటిక ప్రదర్శించారు.



నా శత్రువు నాటికలోని సన్నివేశం

పాక్ జాతీయుల వీసా సేవలు నిలిపివేత

ఏలూరు(మెట్రో): పాకిస్తానీ పౌరులకు భారత ప్రభుత్వం జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025, ఏప్రిల్ 27 నుంచి రద్దుకానున్నాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు, ఎస్పీలకు సంబంధిత సమాచారం పంపారన్నారు. మెడికల్ వీసాలు, లాంగ్ టర్మ్ వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 27 ఏప్రిల్, 2025 నుంచి రద్దవుతాయని చెప్పారు. మెడికల్ వీసా 29 ఏప్రిల్, 2025 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుందన్నారు.

క్లుప్తంగా

కొంతేరులో నాటిక పోటీలు ప్రారంభం



ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటికలోని సన్నివేశం

యలమంచిలి: యూత్ క్లబ్ నాటక పరిషత్ ఆధ్వర్యంలో కొంతేరు గ్రామంలోని పులపర్తి వీరాస్వామి కళామందిరంలో నిర్వహించిన అఖిల భారత స్థాయి నాటిక పోటీలలో తొలి రోజు రెండు నాటికలు ప్రదర్శించారు. మొదటగా గుడివాడకు చెందిన కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటిక ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. పీవీ సత్యనారాయణ రచించిన ఈ నాటకానికి పి.కృష్ణ హితేష్ దర్శకత్వం వహించారు. రెండవ నాటికగా హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన స్వేచ్ఛ నాటిక అలరించింది. ఈ నాటికను పరమాత్ముని శివరాం రచించారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్టు

పాలకొల్లు (సెంట్రల్): కూటమి నాయకులను ఎక్స్ ఖాతాలో దూషించారంటూ అందిన ఫిర్యాదు మేరకు తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం చిగురువాడ గ్రామానికి చెందిన అమితి హరి ప్రసాద్‌అనే వ్యక్తిని అదుపు తీసుకున్నామని పాలకొల్లు టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించడం, బూతులు తిడుతూ వారి వ్యక్తిత్వహననానికి పాల్పడ్డాడని పాలకొల్లుకు చెందిన టీడీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్ ఫిర్యాదు చేశారన్నారు. అలాగే సీఎం చంద్రబాబు, లోకేష్‌లపై కూడా తిడుతూ పోస్టులు పెట్టారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.రజిని కుమార్ తెలిపారు.

ఎంపీడీఓను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నం

ఉంగుటూరు: ఉంగుటూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంజి రాజ్‌మనోజ్‌కు శుక్రవారం ఓ వింత అనుభవం ఎదురైంది. శుక్రవారం ఎంపీడీఓకు ఓ నంబర్ నుంచి ఓ ఫోన్ వచ్చింది. లైన్‌లో ఉండండి ప్రిన్సిపల్ సెక్రటరీ గారు మాట్లాడుతున్నారని ఎంపీడీఓకు ఫోను కలిపారు. నేను పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ త్రివేదిని అంటూ మాట్లాడుతూ మా మేనల్లుడు ఆశ్రం ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు . డబ్బు సర్దండి అంటూ ఒక ఫోను నెంబరు చెప్పారు. పైగా ఈ విషయం ఎవరికి చెప్పకండంటూ చెప్పారు. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన ఎంపీడీఓ ముందు తడబడినా ఆ తర్వాత పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సత్యభూషణ కుమార్ కదా? అని గుర్తు వచ్చి మిన్నకుండిపోయారు.

దొంగ అరెస్టు

భీమవరం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు చైన్ లాక్కుని పారిపోతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై కృష్ణాజీ శుక్రవారం చెప్పారు. మెంటేవారితోటకు చెందిన జి.వాసవి బుధవారం మార్కెట్‌కు రైల్వే అండర్ టన్నెల్ నుంచి నడుచుకుంటూ వస్తుండగా పాలకొల్లుకు చెందిన కొప్పర్తి అలెగ్జాండర్ పాల్ ఆమె మెడలోని చైన్ లాక్కుని పారిపోతుండగా వాసవి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కలవారు పాల్‌ను వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితుడిని చేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై కృష్ణాజీ చెప్పారు.

లారీ తిరగబడి డ్రైవర్ మృతి

జంగారెడ్డిగూడెం: మండలంలోని పుట్లగట్లగూడెం నుంచి పంగిడిగూడెం వైపు వెళ్ళే గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రీన్ ఫీల్డ్ హైవే లారీ డ్రైవర్ ధనుంజయ్ సింగ్ (44) ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. లక్కవరం ఎస్సై శశాంక తెలిపిన వివరాల ప్రకారం ఝార్ఖండ్ రాష్ట్రం పిప్రా గ్రామానికి చెందిన ధనుంజయ్ సింగ్ కొంత కాలంగా గ్రీన్ ఫీల్డ్ హైవే స్టాక్ పాయింట్‌లో కాంక్రీట్ మిక్సర్ లారీ డ్రైవరుగా పని చేస్తున్నాడు. శుక్రవారం లారీలో కాంక్రీట్ తీసుకుని పంగిడిగూడెం వైపునకు వెళ్తున్నాడు. రహదారి మధ్యలో లారీ నిలిచిపోవడంతో పదేపదే లారీను స్టార్ట్ చేయగానే లారీ వెనక్కి వెళ్లి డివైడర్‌ను ఢీకొట్టి తిరగబడింది. ఈ ప్రమాదంలో ధనుంజయ్ సింగ్ తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలం వద్దనే మృతి చెందాడు. ఈ ఘటనపై గ్రీన్ ఫీల్డ్ హైవే సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- పోలవరం కాలువ గట్టుపై ఉన్న చెట్లపై టీడీపీ నేత కన్ను
- కొంత కలప విక్రయం, మరికొంత అమ్మేందుకు సిద్ధం



ఎం.నాగులపల్లి సమీపంలో తరలించడానికి సిద్ధంగా ఉంచిన కలప

ద్వారకాతిరుమల : ఓ పచ్చనేత పోలవరం కుడి కాలువ గట్టుపై ఉన్న చెట్లపై కన్నేశాడు. ఇంకేముంది పట్టపగలే వాటిని నరికించే పనిలో పడ్డాడు. ఇప్పటికే వేప తదితర జాతులకు చెందిన దశాబ్దాల కాలం నాటి ఎన్నో చెట్లను నరికించేశాడు. ఇప్పటికే కొంత కలపను విక్రయించగా, మరి కొంత కలపను విక్రయించేందుకు సిద్ధం చేశాడు. చెట్ల నరికివేతపై ఆ నాయకుడిని ఎవరైనా ప్రశ్నిస్తే, నేనెవరో తెలుసా..? టీడీపీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్‌ని అంటున్నాడు. దాంతో సంబంధిత అధికారులు సైతం ఆ వైపు కన్నెత్తి చూడడానికి భయపడుతున్నారు. వివరాల ప్రకారం ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం-గుణ్ణంపల్లి మధ్యలోని పోలవరం కుడి కాలువ గట్టుపై గత పది రోజులుగా చెట్లు నరికివేత పనులు జరుగుతున్నాయి. పట్టపగలే ఈ పనులు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. దాంతో ఎంతో విలువైన వేప, తదితర జాతులకు చెందిన భారీ వృక్షాలను నరికి వేస్తున్నారు. ఇప్పటికే కొంత కలపను విక్రయించగా, మరి కొంత కలపను అమ్మేందుకు సిద్ధం చేశారు. కాలువ గట్టుపై అక్కడక్కడా ఆ కలపను గుట్టలుగా ఉంచారు.



పంగిడిగూడెం-గుణ్ణంపల్లి మధ్యలో పోలవరం కుడి కాలువ గట్టుపై చెట్లను నరికివేసిన ఆనవాళ్లు



నరికిన చెట్లను ట్రాక్టర్‌తో లాగుతున్న అక్రమార్కులు

అసలు నేనెవరో తెలుసా..?

ఎం.నాగులపల్లి-గుణ్ణంపల్లి మధ్యలో శుక్రవారం చెట్లు నరికే సమయంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అటుగా వెళ్లారు. నరికిన చెట్లను ట్రాక్టర్‌తో బయటకు లాగడాన్ని చూసి, అక్కడున్న వారిని నిలదీశారు. ఎంతో విలువైన వేప చెట్లను ఎవరి అనుమతులతో నరుకుతున్నారని ప్రశ్నించారు. దాంతో కోపోద్రిక్తుడైన ఒక నాయకుడు అసలు నేనెవరో తెలుసా.. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిని, నేను చూసుకుంటాను అంటూ ఊగిపోయాడు. ఫోన్‌లో వీడియో ఎందుకు తీస్తున్నారని బైక్‌పై ఉన్న వారితో సదరు నాయకుడు, అతనితో ఉన్న వారు వాగ్వివాదానికి దిగారు. దాంతో ఏం చేస్తారోనన్న భయంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఈ అక్రమాలను ఆపేదెవరూ?

కళ్లముందే పచ్చని చెట్లను నరికేస్తుంటే సంబంధిత అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమని స్థానికులు అంటున్నారు. ఎంత అధికార పార్టీ నాయకులైతే మాత్రం అక్రమంగా చెట్లు నరికి, అమ్మేస్తుంటే పట్టించుకోరా? అని ప్రశ్నిస్తున్నారు. కాలువ గట్టుపై జంతుజాలాలు, పక్షు జాతులకు ఆవాసంగా ఉన్న చెట్లను అక్రమంగా నరికివేయడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెట్లను నరికి, అమ్ముకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిబంధనలను మీరి మరీ..

ఏలూరు డివిజన్(4, 5 ప్యాకేజీలు) పరిధిలోని పోలవరం కుడి కాలువ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించేందుకు భీమవరానికి చెందిన పంచగర్ల సత్యనారాయణ కాంట్రాక్టుకు తీసుకున్నాడు. నారాయణపురం పరిధిలోని కాలువ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులను తామే చేసి, అప్పగిస్తామని పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేఎస్ఆర్ కాంట్రాక్టర్‌తో మాట్లాడుకుని, అక్కడ తుమ్మచెట్లు నరకకుండా మొత్తం వేప చెట్లను నరికేశారు. దీనిపై నాకు శుక్రవారం కొందరు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత వ్యక్తులను ఏలూరు కార్యాలయానికి వచ్చి ఫైన్ కట్టమని హెచ్చరించాను. అలాగే దగ్గరుండి పనులు చేయించాలని కాంట్రాక్టరుకు సూచించాను.

– బాపూజీ, ఇరిగేషన్ ఏఈ

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



శివయ్య మృతదేహం

ముసునూరు: ఆయిల్‌పామ్ తోటలో పనికి వెళ్లిన వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు కొత్తూరుకు చెందిన చిమట శివయ్య(35) శుక్రవారం గ్రామంలోని పాలడుగు నాగేంద్రబాబుకు చెందిన ఆయిల్ పామ్ తోటలో గెలలు కోసే పనికి వెళ్లాడు. గెలలు కోస్తూ ఉండగా, గెలలు కోసే కత్తి 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. క్షతగాత్రుడిని సహచరులు నూజివీడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యజమానిని కోల్పోవడంతో కటుంబాని ఏ ఆధారం లేకుండా పోయిందని విలవిల్లాడుతున్నారు.

పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులతో ఉద్యోగావకాశాలు



టెన్త్ విద్యార్థి యశస్వినిని అభినందిస్తున్న కలెక్టర్ నాగరాణి, డీఈవో నారాయణ

భీమవరం: పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు చేసిన వారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. టెన్త్‌లో మంచి మార్కులు సాధించి పాలిటెక్నిక్‌లో చేరాలనుకోవడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కాళ్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యనభ్యసించిన నిమ్మల యశస్విని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 586 మార్కులను సాధించిన సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా ఏం చదవాలి? అనుకుంటున్నావని కలెక్టర్ ప్రశ్నించగా పాలిసెట్ ఎంట్రన్స్ టెస్ట్ రాసి పాలిటెక్నిక్ చదవాలనుకుంటున్నట్లు అభిప్రాయం వ్యక్తం చేయడంతో మంచి నిర్ణయమంటూ యశస్వినిని కలెక్టర్ నాగరాణి అభినందించారు. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు కోర్సుల ఎంపికలో యశస్వినిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మంచి ఫలితాల సాధనకు విద్యార్థులను ప్రోత్సహించిన ప్రధానోపాధ్యాయుడు జేఎల్ఎం శాస్త్రి శాలువాతో కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ, ఎంఈఓ ఎ.రవీంద్ర, విద్యార్థిని తల్లిదండ్రులు నిమ్మల శ్రీనివాసరావు, భారతి తదితరులు పాల్గొన్నారు.



అశ్వానికి జల్లు స్నానం చేయిస్తున్న సిబ్బంది



షవర్ల కింద జల్లు స్నానం చేస్తున్న గజలక్ష్మి



గోసంరక్షణశాలలో జల్లు స్నానం చేస్తున్న ఆవులు

వారెవ్వా.. షవర్ బాత్

శ్రీవారి కొండపై జల్లు స్నానంతో సేదతీరుతున్న మూగజీవాలు

భానుడి భగభగలకు మూగజీవాలు అల్లాడుతున్నాయి. అయితే ద్వారకాతిరుమల క్షేత్రంలోని దేవస్థానం గో సంరక్షణశాలలో మూగజీవాలు షవర్ బాత్‌లు చేస్తూ ఉపశమనాన్ని పొందుతున్నాయి. ఎక్కడాలేని విధంగా దేవస్థానం అధికారులు ఈ మూగజీవాల కోసం రూ. 2 లక్షలు పైగా వెచ్చించి గో, గజ శాలల్లో గతంలోనే షవర్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ ఆవులు, గిత్తలకు, అలాగే అశ్వానికి షవర్ల కిందే సిబ్బంది జల్లు స్నానం చేయిస్తున్నారు. అదేవిధంగా గజలక్ష్మి సైతం జల్లు స్నానంతో ఉపసమనాన్ని పొందుతోంది. కజానా బాతులైతే ఎక్కువ సమయం గోసంరక్షణశాలలోని కొలనులోనే ఉంటున్నాయి. ఇవి చూపరులను ఆకర్షిస్తున్నాయి.

– ద్వారకాతిరుమల



గోశాలలోని కొలనులో ఈదుతున్న కజానా బాతులు

చెల్లి మరణం తట్టుకోలేక అన్న ఆత్మహత్య



బాల లక్ష్మీ నరసింహ మృతదేహం

పెనుగొండ: తోడబుట్టిన చెల్లెలు మరణాన్ని తట్టుకోలేక అమ్మా నేనూ వచ్చేస్తున్నానంటూ అన్న ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సిద్ధాంతం ప్రజలను కలచివేసింది. సిద్ధాంతానికి చెందిన ఈదుపల్లి లక్ష్మీ నరసింహ(21) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి మృత్యువుతో పోరాడి బుధవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచాడు. వివరాల్లోకి వెళితే సిద్ధాంతంకు చెందిన ఈదుపల్లి నాగలక్ష్మీ అనారోగ్యంతో ఈ నెల 10న ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో ఏసీ మెకానిక్‌గా జీవనం సాగిస్తున్న అన్న లక్ష్మీ నరసింహ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. చెల్లె మరణం జీర్ణించుకోలేక ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తల్లిదండ్రులు వెంటనే గమనించి తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి తుది శ్వాస విడిచాడు. దీంతో తండ్రి ఈదుబిల్లి సూర్య నారాయణ ఫిర్యాదు మేరకు పెనుగొండ ఎస్సై కొప్పిశెట్టి గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే ఇద్దరు పిల్లలూ మృత్యువాత పడడంతో ఈదుబిల్లి సూర్యనారాయణ దంపతులు తల్లడిల్లిపోతున్నారు. పెనుగొండలో చదువుకుంటున్న కూతురు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మరువక ముందే చేతికందివచ్చి, కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కొడుకూ మృతి చెందడంతో తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి వల్లా కావడం లేదు.

దళితుల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



డీఆర్‌ఓకి వినతి పత్రం అందజేస్తున్న దళిత సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): చింతలపూడి మండలం బట్టువారిగూడెం గ్రామం విష్ణు సాగర్‌రోడ్డులో దళిత మహిళ పాము రాణిసాగు చేసుకునే భూమిని ఆక్రమించి చుట్టూ ఫెన్సింగ్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి అదనపు విశ్వేశ్వరరావు ని కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవి ప్రకాష్ మాట్లాడుతూ సర్వే నంబర్ 1373/1 కి చెందిన మెట్ట భూమి 2.55 ఎకరాల భూమిని అగ్రవర్ణానికి చెందిన కంభం మెట్టు ఉషశ్రీ తన భర్త శ్యామసుందర్, ఆమె బంధువులు ఆమె తీసుకొచ్చిన కొంతమంది దళారులు కూలీలతో దౌర్జన్యంగా భూమిలోకి చొరబడి నారు పాము రాణిపై ఆమె భర్తపై కులం పేరుతో దూషణకు పాల్పడి వారిని కింద పడేసి కొట్టారన్నారు. దళిత మహిళ నారపాము రాణి జీవనాధారమైన మెట్ట సాగు భూమినే సుమారు 70 సంవత్సరాల నుండి ఆమె పూర్వీకులు నుండి ఇప్పటివరకు సాగు చేసుకుని జీవిస్తున్నారు. సదరు భూమిలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ బావి, బోరు ఏర్పాటు చేశారు. ఈ ఆక్రమణపై స్పందించిన డీఆర్ఓ విచారణ నిమిత్తం నూజివీడు ఆర్డీఓకు ఎండార్స్ చేసినట్లు రవిప్రకాష్ తెలిపారు.

గ్రీస్‌లో ఉద్యోగాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రీస్ దేశంలో కన్‌స్ట్రక్షన్‌లో హెల్పర్స్‌గా ఉద్యోగాలు ఉన్నాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్ర బాబు శుక్రవారం విలేకరలుకు తెలిపారు. ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ అవసరలేదని, వయసు 40 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. మగవారు మాత్రమే ఈ జాబ్‌కి అర్హులని నెలకు జీతం ఇండియా డబ్బులో రూ. 82,000, కాంట్రాక్ట్ పీరియడ్ ఒక్క సంవత్సరం ఉంటుందని, వారానికి ఐదు రోజులు పనిదినాలు ఉంటాయన్నారు. జాబ్ సెలెక్షన్ చేయడానికి ఇంగ్లిష్ ప్రొఫిసియన్సీ టెస్ట్ అండ్ టెక్నికల్ స్కిల్స్ అసెస్మెంట్ ఉత్తీర్ణత పొందాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

చెరువుల్లో మట్టిని తోడేస్తున్న మాఫియా



ఓగిరాల తండాలోని పాలెం చెరువులో పొక్లెయిన్‌తో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వైనం

నూజివీడు: అధికార పార్టీ మట్టి మాఫియా చెరువుల్లోని మట్టిని తోడేస్తోంది. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తు న్నా అధికార వర్గాలు కళ్లు మూసుకుని కూర్చుంటున్నారే గానీ వాటి వైపు కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూజివీడు మండలం ఓగిరాల తండాకు చెందిన టీడీపీ నాయకుడు గ్రామంలో ఉన్న పాలెం చెరువులో మూడు రోజులుగా అక్రమ తవ్వకాలు చేపట్టి మట్టిని బయటకు తరలిస్తున్నారు. ట్రాక్టరు ట్రక్కు మట్టిని రూ.500ల నుంచి రూ.600లకు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇందులో ప్రొక్లెయిన్‌తో తవ్వి ట్రాక్టర్ నింపడానికి రూ.100లు చెల్లిస్తున్నారు. ఈ చెరువు మట్టి ఓగిరాల తండా, హటియాతండా, హరిశ్చంద్ర తండాలకు వెళ్తోంది. ఆయా గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఎవరైనా తమకు మట్టి కావాలంటే వారికి తోలకుండా కేవలం టీడీపీ వారికే మట్టిని అమ్ముతున్నారని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. చెరువు అనేది గ్రామ ప్రజలందరదీ అయినప్పుడు కొంతమందికి తోలడం, కొంతమందికి తోలకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా మైనింగ్ చేసి మట్టిని అమ్ముకుంటున్నా ఇటు రెవెన్యూ అధికారులు గానీ, అటు ఇరిగేషన్ అధికారులు గానీ, మైనింగ్ అధికారులు గానీ ఏమీ పట్టనట్లు ఉండటం గమనార్హం. అయితే శుక్రవారం మధ్యాహ్నానికి గ్రామస్తుల నుంచి రెవెన్యూ అధికారులకు అక్రమ తవ్వకాలపై పదేపదే ఫోన్లు రావడంతో మట్టి తవ్వకాలను ఆపారు. ఇటీవల ఆగిరిపల్లి మండలం నర్సింగపాలెంలో సీఎం ఇంటి మెరక పనులకు అంటూ కొండ నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తవ్వి టిప్పర్లలో తరలించి అమ్ముకున్నారు. ఇక్కడ విచ్చలవిడిగా జరుగుతున్న తవ్వకాల గురించి అధికారులు పట్టించుకోకపోయినా గ్రామస్తులే అడ్డుకున్నారు. ఇదే మండలంలోని ఈదరలోని పంగిడమ్మ చెరువులోని మట్టిని సైతం కొల్లగొడుతున్నారు. ఈ చెరువు నుంచి మట్టి ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలకు మట్టిమాఫియా సరఫరా చేస్తోంది. నూజివీడు మండలంలో కొన్నంగుంట, పోతురెడ్డిపల్లి, మొర్సపూడి, చాట్రాయి మండలం పోలవరం తదితర గ్రామాల్లో కూడా చెరువుల్లోని మట్టిని అడ్డగోలుగా కొల్లగొడుతున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడి గల్లంతు



లాలూ నాయక్(ఫైల్)

ద్వారకాతిరుమల: పేరుపాలెం బీచ్‌లో స్నేహితులతో కలసి సరదాగా స్నానం చేస్తుండగా ద్వారకాతిరుమలకు చెందిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. వివరాల ప్రకారం మండలంలోని కొమ్మర, కోడిగూడెం, ద్వారకా తిరుమల, సత్తెన్నగూడెం గ్రామాలకు చెందిన 10 మంది యువకులు శుక్రవారం ఉదయం ఒక ఆటోలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లారు. బీచ్‌లో స్నానం చేస్తుండగా ద్వారకాతిరుమలకు చెందిన లాలూ నాయక్(17), సత్తెన్నగూడెం గ్రామానికి చెందిన మధు బీచ్ లోపలికంటూ వెళ్లారు. లాలూ నాయక్ గల్లంతు కాగా, మధు ప్రాణాలతో బయటపడ్డాడు. సహాయక సిబ్బంది నాయక్ కోసం గాలిస్తున్నారు. తొమ్మిది మంది యువకులు ప్రస్తుతం పోలీసుల సంరక్షణలో ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

జంగారెడ్డిగూడెం: తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లోకి పట్టపగలు తాళాలు పగులగొట్టి ఇళ్లల్లోకి చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టి.నరసాపురం మండలం సింగరాయపాలెం గ్రామానికి చెందిన ఒంటెద్దు క్రాంతికుమార్‌రెడ్డిని అరెస్టు చేశామని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 200 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

క్లుప్తంగా

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత



అత్తిలి ఎంఎం స్కూల్‌లో మెరిట్ విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

అత్తిలి: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని అత్తిలి మదర్ మెర్సిల్లా స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జ్యోతి శుక్రవారం తెలిపారు. 500కు పైగా మార్కులు41 మంది, 400కు పైగా మార్కులు 15 మంది విద్యార్థులు సాధించారని ఆమె చెప్పారు. 533 మార్కులతో 2వ స్థానం పొందిన విద్యార్థిని స్కూల్ యాజమాన్యం అభినందించారు.

సత్తా చాటిన టీబీఆర్ స్కూల్ విద్యార్థులు



పదోతరగతి విద్యార్థిని కల్యాణిని అభినందిస్తున్న టీబీఆర్ సంస్థల చైర్మన్ భోగేశ్వరరావు

పెంటపాడు: మండలంలోని అలంపురం టీబీఆర్ సైనికస్కూల్లో పదోతరగతి విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు టీబీఆర్ సంస్థల చైర్మన్ తనబుద్ది భోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్ రిషిత 585 మార్కులు సాధించడం పట్ల ఈ సందర్భంగా శుక్రవారం స్కూల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు మాట్లాడుతూ విద్యతో పాటు, క్రమశిక్షణ, ఆటలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తున్నట్లు తెలిపారు. టబిఆర్ సీఈవో రవికిరణ్ మాట్లాడుతూ సమాజం పట్ల ప్రత్యేక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమ సంస్థ విద్యార్థులను తయారు చేస్తున్నట్లు తెలిపారు. స్కూలు హెచ్ఎం కల్యాణి, ఏవో నాగరాజు తదితరులు మాట్లాడారు. అధ్యాపకురాలు పర్వీన్‌కుమారి శర్మ అధ్యాపకుతుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య



దర్శిపర్రులో నిరసన తెలుపుతున్న దృశ్యం

పెంటపాడు: భారత్ పై ఉగ్రదాడులను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌పై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. మండలంలో దర్శిపర్రు గ్రామ ప్రముఖుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి తీవ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించి, స్థానిక దేవాలయం వద్ద మానవహారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, విద్యార్థులు, స్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): పహల్గాంలో పర్యాటకులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది కోరారు. శుక్రవారం అమరులైన ప్రజలకు నివాళులర్పించారు. నిరసన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ ఉగ్రవాదులు సామాన్య ప్రజల ప్రాణాలు తీయడం దారుణం అన్నారు. బ్యాంకు ఛీఫ్ మేనేజర్ పీపీఎస్ఆర్ బాబు, యూనియన్ సీనియర్ నాయకులు ఎస్ఎస్ ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ స్రవంతి, జి.ప్రకాష్, ఏడుకొండలు, పాల్గొన్నారు.

యర్రాయి చెరువు వద్ద ఉద్రిక్తత

ఇరగవరం: మండలంలోని కావలిపురం శివారు ప్రాంతం యర్రాయిచెర్వు, వేల్పూరులోని యర్రాయిచెర్వు పాయలకు సంబంధించి స్నాన వాటికల వద్ద శుక్రవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వేల్పూరు యర్రాయిచెర్వు వద్ద స్నాన వాటికలను మూసి వేయడం ఎంతవరకు సబబని ఇరగవరం స్థానికులు ఆందోళనకు దిగారు. సంఘటనా స్థలానికి తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, ఇరగవరం ఎస్ఐ జానా సతీష్, తణుకు రూరల్ సీఐ, సిబ్బందితో ఆందోళన చేస్తున్న వ్యక్తులను చెదరగొట్టారు. అయితే ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణకు ఈ విషయం ముందే తెలిసినప్పటికీ దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో మూడు గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజాసమస్యల పరిష్కారానికి కూటమి నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని నందమూరు గ్రామంలో రూ.50లక్షలతో పూర్తి చేసిన నందమూరు, మారంపల్లి, ఆరుళ్ల త్రీఫేస్ విద్యుత్ లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు, అధికారుల భాగస్వామ్యంతోనే ఏ పనైనా సాధ్యమన్నారు. గ్రామానికి చెందిన పలువురు తమ వ్యక్తిగత సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. విద్యుత్ ఏడీఏ రామకృష్ణ, ఏఈ రామకృష్ణ, నాయకులు శనగన రాంబాబు, దార్లంక రాము పాల్గొన్నారు.

ఎండలకు ఉక్కిరిబిక్కిరి



ఎండ వేడిమికి నిర్మానుష్యంగా రహదారులు



నిత్యం రద్దీగా ఉండే గూడ్స్ షెడ్డు రోడ్డులో జనం లేక ఇలా..

- భానుడి భగభగలు
- భయపెడుతున్న ఉష్ణోగ్రతలు, వేడి గాలులు
- వృద్ధులు, పిల్లలు బయటకు రావొద్దని హెచ్చరికలు
- వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): భానుడు భగభగమండుతున్నాడు. పగటి పూటతో పాటు రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీంతో ఉదయం నుంచే వడగాల్పులు వీయడం ప్రారంభమవుతున్నాయి. రాత్రి పూట ఉష్ణోగ్రతలు పెరగడంతో వేడి సెగలు కక్కుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపించడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడిపోతున్నారు. వేడి గాలులుకు అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నం సమయానికి ప్రజలు ఇళ్లకే పరిమితం అవ్వడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పగటి పూట తమ పనుల నిమిత్తం తిరిగే ప్రజలు, పొలం పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు మండుతున్న ఎండలు చూసి భయాందోళనతో బయటకు రాలేకపోతున్నారు. ఉక్కపోతలతో వృద్ధులు, చిన్న పిల్లలు మరింత అల్లాడిపోతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే మే నెల రోహిణీ కార్తిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు తీవ్ర భయందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువ ఉండే అవకాశం ఉందని ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వడదెబ్బ తీవ్రమైనది

అధిక ఉష్ణోగ్రతలు, శరీరం యొక్క ప్రాథమిక అవయవాలు విఫలమయ్యేలా చేస్తాయి. వేడికి సంబంధించిన సమస్యలలో వడదెబ్బ చాలా తీవ్రమైనది. శరీరంలో వేడిన చల్లబర్చడానికి చెమటపట్టే క్రమంలో కొన్నిసార్లు రక్తంలో ద్రవం ఎక్కువగా ఆవిరైపోతుంది. అప్పుడు శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ కుప్పకూలి, చెమట పట్టడం కూడా ఆగిపోతుంది. శరీర ఉష్ణోగ్రత బాగా పెరిగిపోతుంది. కొన్ని సందర్భాల్లో శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీలు కూడా దాటవచ్చు. ఆ సమయంలో శరీరం ముట్టుకుంటే కాలుతూ ఉంటుంది. చర్మం పొడిబారుతుంది. నీరు, రక్తం పరిమాణం తగ్గడం వల్ల రక్తపోటు కూడా పడిపోతుంది. వడదెబ్బ తగులుతుంది.

లక్షణాలు

వడదెబ్బకు ముందస్తు సూచనలు ఎండ వేడిమికి తట్టుకోలేక కొంత మందిలో తీవ్రమైన నీరసం, నిస్సత్తువ, నిస్త్రాణ ఉంటుంది. చుట్టుపక్కల వేడి గాలిని, శరీరం తట్టుకోలేకపోతుందని, చల్లబరుచలేకపోతుందనడానికి ఇది ఒక హెచ్చరిక.

విపరీతంగా చెమట పడుతుంది. శ్వాస ఎక్కువగా తీసుకోవాల్సి వస్తుంది. ఎక్కువ చెమట పట్టడం వల్ల శరీరంలో లవణాలు కూడా బయటకు వెళ్లిపోతాయి. నాడి వేగం తగ్గుతుంది. ఇదే పరిస్థితి ఎక్కువ సేపు ఉంటే వడదెబ్బకు దారి తీస్తుంది.

వడదెబ్బకు కారణాలు

జీవక్రియలో భాగంగా ఎక్కువ వేడి ఉత్పన్నం కావడం, పరిసరాల్లో వేడి ఎక్కువగా ఉండటం వంటి కారణాలు వల్ల శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థ సరిగా పనిచేయక శరీర ఉష్ణోగ్రత అమాంతం పెరిగిపోతుంది. శరీరం చల్లబడటాన్ని అడ్డుకునే పదార్థాలైనా ఆల్కహాల్, ఉత్ప్రేరకాలు, కొన్ని రకాలు ఔషధాలు డీహైడ్రేషన్‌ను కలుగుజేస్తాయి. ఇది సాధారణంగా పెద్ద వాళ్లలోనూ, పెద్దగా గాలి ఆడని ప్రదేశాల్లో నివాసం ఉండే వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తుంది.

నియంత్రణ

వడదెబ్బను నివారించడానికి ద్రవ పదార్థాలు ఎక్కు వ తీసుకోవాలి, మంచినీరుతో పాటు కొబ్బరి నీళ్ళు, చెరుకురసం, నిమ్మరసం, పండ్ల రసాలు, బార్లీ నీళ్లు, సబ్జా గింజలు నీళ్లు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్, వంటివి తరుచుగా తీసుకుంటూ ఉండాలి. అధిక వేడికి దూరంగా ఉండాలి.

చికిత్స

వడదెబ్బకు గురైనప్పుడు శరీరాన్ని వేగంగా చల్లబరిచే ప్రయత్నం చేయాలి. చల్లటి నీళ్ల చల్లడం, ఫ్యాను గాలి ధారాళంగా తగలనీయాలి. చల్లటి సెలైన్లు నరాలు ద్వారా ఎక్కించడం కూడా చేయవచ్చు.

వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చిన్న పిల్లలు, బాలింతలు, వయో వృద్ధులు ఎండలో ఎక్కువగా తిరగరాదు. అవసరమై బయటకు వెళ్లవలసి వస్తే నెత్తికి గొడుగు లేదా టోపి రక్షణగా వాడాలి. వేసవికాలంలో వదులైన నూలు దస్తులు తప్పక ధరించాలి.
- అన్ని రకాల కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. కారం, మసాలా పదార్థాలు తినడం తగ్గించడం ద్వారా అనారోగ్యం పాలుకాకుండా ఉండవచ్చు.
- తగినంత నిద్ర అవసరం
- ప్రతిరోజు ధ్యానం లేదా యోగాను ప్రాక్టీస్ చేయాలి. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలి. తగినంత నిద్ర పోవాలి. శరీరం వేడెక్కిన, తల తిరుగుతున్నట్లు అనిపిస్తే చల్లని స్నానం చేయడం ద్వారా శరీర ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

వేసవి జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి



ఎండ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. రానున్న మే నెలలో మరింత ఉష్ణోగ్రతలు పెరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఉదయం 10 గంటల తర్వాత ఇంటిలో నుంచి బయటకు వెళ్లకూడదు. అదే విధంగా సాయంత్రం 4 గంటల తర్వాత బయటకు తిరగవచ్చు. పిల్లలు ఎట్టిపరిస్థితులలోను ఎండలో ఆటలు ఆడకూడదు. వృద్ధులు తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలి. వడదెబ్బ తగిలితే తక్షణమే ప్రాథమిక చికిత్స అందిస్తునే ఆసుపత్రికి త్వరితగతిగా తీసుకువెళ్లాలి.

– డాక్టర్ కోసూరి రవి కుమార్, మెడికల్ ఆఫీసర్, తాడేపల్లిగూడెం



జ్యూస్‌లు షాపులు వద్ద ప్రజలు



నిత్యం రద్దీగా ఉండే పురపాలక సంఘం భవనం వద్ద



పోలీస్ ఐలాండ్ వద్ద

సేవల్లో రాజకీయాలకు తావివ్వరాదు

- ప్రజా సమస్యలపై ధ్వజమెత్తిన ప్రజాప్రతినిధులు
- ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్
- తాగునీటి సమస్య లేవనెత్తిన సర్పంచ్ పాలా శ్రీనివాస్



తణుకులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: ప్రభుత్వాలు మారినా అభివృద్ధి పనులు, బిల్లుల విడుదలలో జాప్యం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. తణుకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు అందాల్సిన సేవల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని, పార్టీల బేధాల్లేకుండా పనులు చేయాలని కోరారు. ముఖ్యంగా గత ప్రభుత్వంలో అధికారుల తీరును తప్పుపడుతూ వాటిని నేడు పరిగణలోకి తీసుకువచ్చి శిక్షలు వేసి జైలుకు పంపిస్తుండడం బాధాకరమన్నారు. ఈ కారణంగా అధికారులు సైతం తమకున్న గైడ్‌లైన్స్ ప్రకారమే విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాల్సిన పరిస్థితులు వచ్చాయని స్పష్టం చేశారు. ప్రతి పని కూడా పారదర్శకంగా ఉండేలా చూసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు చేస్తున్న ఫిర్యాదులు, సమస్యలపై ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ స్పందించి ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తారని వాటిపై అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే ఎలా కుదురుతుందని నిలదీశారు. ప్రతి సమస్యకు అధికారులు సాధ్యమైనంత త్వందరగా పరిష్కరించే విధంగా కృషి చేయాలని అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రజాప్రతినిధులకే సమస్యలు పరిష్కరించకపోతే ఇక సామాన్యుడి పరిస్థితేంటని ప్రశ్నించారు.

సమస్యలపై ధ్వజమెత్తిన ఎంపీటీసీ సభ్యులు

అభివృద్ధి పనుల తాలూకా బిల్లులు రాలేదని, ఎంపీటీసీలకు వేతన బకాయిలు ఇవ్వాలని, తాగునీరు అందడంలేదని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు అధికారికంగా ఎటువంటి సమాచారాలు పూర్తిస్థాయిలో తెలపడంలేదని, చేసిన పనులకు బిల్లులు ఇప్పించాలని, కొన్ని విభాగాల్లో అయితే అధికారులు అసలు మేము ఎవరో తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని, అధికారపార్టీ వారిని ఒకలా, ప్రతిపక్ష పార్టీకి చెందిన వారితో ఒకలా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. మండలస్థాయిలో ఎన్ని నిధులు ఉన్నాయి, ఏంటనే విషయాలు కూడా తమకు తెలపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మహలక్ష్మీచెర్వుకు తాగు నీరిప్పించండి మహాప్రభో..

తణుకు మండలం మహలక్ష్మీచెర్వు గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కరించడంలేదంటూ ఆ గ్రామ సర్పంచ్ పాలా శ్రీనివాస్ విమర్శించారు. మేము అడిగేది ప్రజల కోసమేనని మా కోసం కాదనే విషయం తెలుసుకోవాలని అధికారులను నిలదీశారు. వేసవిలో తాగునీటికి కటకటలాడుతున్నామని మీరు పంచాయతీ కుళాయి ద్వారా తాగునీరు ఇవ్వకపోతే చెరువుల వద్దకు వెళ్లి ఆనీటిని తాగాల్సిన దుస్థితి వచ్చేలా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఐసీడీఎస్ విభాగ సేవలు కూడా బాలేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ సర్పంచ్‌గా చెప్పినా పనులు చేయని స్థితిలో ఆ అధికారి ఉన్నారని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా హౌసింగ్, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసీడీఎస్ విభాగాల అధికారులు ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలకు సమాధానాలిచ్చారు. ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ వర్మ, ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, ఎంపీడీవో కార్యాలయ ఏవో వనిమిశెట్టి కృష్ణచంద్రరావు, అధికారులు, గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజు క్షమాపణ చెప్పాలి



తణుకు నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు ప్రతాప్, అజయకుమారి



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

తణుకు అర్బన్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, పట్టణ కార్యదర్శి ఎ.అజయకుమారి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు మాట్లాడారు. రోడ్డు పక్కన ఉన్న పేదలకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లు తొలగించడం అన్యాయమన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శిపై ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు నోటికొచ్చినట్లు మాట్లాడడం బాధాకరమన్నారు. తక్షణమే ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలని, పెత్తందార్లు కోసం పేదల ఇళ్లు తొలగించడం సిగ్గుచేటని విమర్శించారు. శ్రీనివాసరావును విమర్శించే స్థాయి రఘురామకృష్ణరాజుకు లేదని ఎద్దేవా చేశారు. ఏ పార్టీ పదవులు ఇస్తే ఆ పార్టీలోకి వెళ్లడం ఉండి ఎమ్మెల్యేకి అలవాటని విమర్శించారు. కామ్రేడ్ శ్రీనివాసరావు విద్యార్థి దశ నుంచి ఒక లక్ష్యం కోసం నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో ఇబ్బందులు లెక్కచేయకుండా పనిచేస్తున్నారన్నారు. ఉండి నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూల్చివేతలు ఆపాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, బళ్ళ చినవీరభద్రం, నాగరత్నం, అంబటి రామకృష్ణ, నర్సింహారావు, వల్లూరి వెంకటేశ్వరావు, జి. అచ్చియ్య, చిన్నారావు, శ్రీనివాస్, ఎస్. రామారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఇరగవరంలో...

ఇరగవరం : డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు రాజీనామా చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ కామన మునిస్వామి డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావును అవమానకరంగా మాట్లాడిన రఘురామ కృష్ణంరాజుకు వ్యతిరేకంగా ఇరగవరంలో శుక్రవారం సీపీఎం పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపారు. కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రజల పక్షాన పనిచేస్తున్న సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శిని ఉండి ఎమ్మెల్యే కనుమూరి పరుష పదజాలంతో మాట్లాడటం సరికాదన్నారు. పాలకోడేరులో సీతారామరాజు నగరంలో గత 50 సంవత్సరాలుగా ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్న పేద ప్రజలు ఇల్లును దౌర్జన్యంగా తొలగించారని తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజా సమస్యలను గతంలో గాలికి వదలివేసి ఢిల్లీలో విలాసవంతంగా జీవితం గడిపారని కృష్ణంరాజును విమర్శించారు. పార్టీ కార్యదర్శి పై అవమానకరంగా మాట్లాడిన దానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



తణుకులో మలేరియా అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



పట్టణంలో ఆరోగ్య కార్యకర్తలు ర్యాలీ

తణుకు అర్బన్: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఎన్జీవో కాలనీ, కొమ్మాయి చెరువుగట్టు, బ్యాంక్ కాలనీల్లోని అర్బన్ హెల్త్ సెంటర్స్ వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్‌ల మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ కె. పృధ్వీరాజ్, డాక్టర్ రాజా నాగభూషణం, డాక్టర్ ఎస్.డానియల్ రాజు మాట్లాడుతూ చలి, వణుకు, ఒళ్లు నొప్పులతో కూడిన రోజు విడిచి రోజు విపరీతమైన జ్వరం, చెమట పట్టి, తదుపరి జ్వరం తగ్గడం వంటి లక్షణాలు మలేరియాకు సంకేతాలని అన్నారు. లక్షణాలున్న వారు అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో అందుబాటులో ఉన్న రాపిడ్ కిట్స్ ద్వారా పరీక్షలు చేయించుకోవచ్చని అన్నారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఇచ్చిన ×మలేరియా అంతం మనతోన్లే అనే నినాదాన్ని పురస్కరించుకుని మలేరియా పాటుపడాలని సూచించారు. నిలవ ఉండే నీళ్లు దోమల పుట్టుకకు నిలయాలని, ఫ్రైడే డ్రైడే పాటించడం ద్వారా దోమ పుట్టుకకు చెక్ పెట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, మహిళా ఆరోగ్య పర్యవేక్షకురాలు సునీత, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాస్, వార్డు హెల్త్ సెక్రెటరీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా అంతానికి కృషి చేద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మలేరియా అంతానికి కృషి చేద్దామని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణ రావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ రవికుమార్, డాక్టర్ వన్యశ్రీ, డాక్టర్ శిరీషలు అధ్యక్షతన సమావేశం జరిగింది. వార్డులలో మలేరియా దినోత్సవ అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలు నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే అనే నినాదం చేశారు. ప్రతి ఇంటి గృహం వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, దోమల నియంత్రణకు కృషి చేయాలని, ఇంట్లో దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, కీటక నియంత్రణ పద్ధతులు అమలు చేయాలని, ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అన్నారు. ఆరోగ్య సిబ్బంది మంగతాయారు, పద్మ, కాంతారావు, ఆశాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంచిన మునిసిపల్ షాపుల అద్దెలు తగ్గించాలి



మునిసిపల్ షాపులు అద్దెలు తగ్గించాలని కోరుతూ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మునిసిపల్ కాంప్లెక్స్ షాపుల అద్దెలను తగ్గించాలని డిమాండ్ చేస్తు మునిసిపల్ షాపు లీజ్‌దారుల జాయింట్‌యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ర్యాలీ చేశారు. షాపులను మూసివేసి కృష్ణ బాలాజీ సెంటర్, ఎన్టీఆర్ చౌక్, మీదుగా మునిసిపల్ కార్యాలయం వరకు చేరుకుని నిరసనలు తెలిపారు. కమిషనర్ యేసుబాబుకు వినతిపత్రం సమర్పించారు. లీజ్‌దారులు మాట్లాడుతూ ఎటువంటి ముందుస్తు నోటీస్‌లు లేకుండా అద్దెలు పెంచడం సరికాదన్నారు. రూ.3,500 ఉన్న లీజ్‌ను రూ 10,000కు పెంచడం పట్ల అభ్యంతరం తెలియజేశారు. వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో అధికంగా పెంచిన లీజును ఎలా కట్టాలని అత్యవసరంగా నోటీస్ ఇవ్వడం సరికాదన్నారు. పాత విధానంలోనే అద్దెలు కట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు స్థల సేకరణ చేయాలి



తణుకులో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: వేల్పూరులో చెత్త చేర వేసేందుకు డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు డిప్యూటీ తహసిల్దారు ఎస్. శ్రీదేవికి సమస్యతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు మాట్లాడుతూ మండలంలో అతిపెద్ద జనాభా కలిగిన వేల్పూరు గ్రామం దినదినాభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్నా పూర్తిస్థాయిలో డంపింగ్ యార్డు లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శాఖ కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ, కుడకా వీరభద్రరావు పాల్గొన్నారు.